క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 13. వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, క్యారెట్ 31. దొండ 23, ఆలు 20, ఉల్లి 14, గోకర 50, దోస 18, సొర 09, పొట్ల 15, అరటి 09, చిక్కుడు 65, అర్వి 35, మునగ 35, చిలగడదుంప 50, బీట్‌రూట్ 19, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 40. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా మక్బూద్ అలీ



నియామకపు పత్రం అందజేస్తున్న రాంరెడ్డి

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఎల్‌బీనగర్ అధ్యక్షుడిగా వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన మహమ్మద్ మక్బూద్ అలీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మైనార్టీ విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంజీ జహంగీర్ (రియాజ్) ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నియామ పత్రాన్ని మక్బూద్ అలీకి పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ మల్‌రెడ్డి రాంరెడ్డి అందజేశారు.

ఆకలి తీర్చడం సంతృప్తికరంగా ఉంది



అన్నదానంలో పాల్గొన్న సుమన్ గౌడ్

ఎల్‌బీనగర్: అన్నదానంతో ఆకలితో ఉన్నవారి క్షుద్బాధను తీర్చటం సంతృప్తికరంగా ఉందని త్రినేత్ర సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుమన్ గౌడ్ అన్నారు. మంగళవారం బీఎన్‌రెడ్డిలోని బాబయ్య కాంప్లెక్స్‌లో సొసైటీ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ... ప్రతీ మంగళవారం బాబయ్య కాంప్లెక్స్‌లో మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఆరు నెలల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలానగర్ ఠాణా పరిధిలో 2011లో నమోదైన అట్రాసిటీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ ఎస్‌సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శేరి ప్రతాప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...తన ఇంట్లో శుభకార్యం జరిగిన మరుసటి రోజు చెత్తను తీసేందుకు వచ్చిన వ్యక్తితో పాటు అతడి భార్యను నిందితుడు కులం పేరుతో దూషించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి 2018లో కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేయగా, సాక్షులను విచారించిన కోర్టు మంగళవారం పైవిధంగా తీర్పు వెలువరించింది.

రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

చాదర్‌ఘాట్: తాత్కాలిక వైకల్యం ఉన్న వారికి రిజర్వేషన్లు రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వికలాంగుల నెట్‌వర్క్ ఎన్‌పీడీఓ ప్రతినిధి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ, వికలాంగుల సంఘాల విజ్ఞప్తుల మేరకు మంత్రి కొప్పుల ఈశ్వర్, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ తాత్కాలిక వికలత్వం ఉన్నవారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం వద్దని ప్రభుత్వానికి నివేదికలు పంపి ఉత్తర్వులు వచ్చేందుకు కృషి చేశారన్నారు. వారికి ఆయన తమ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తులు రాగానే విచారణ చేపడతాం

చాదర్‌ఘాట్: జీఓ 58, 59 కింద ఇళ్ల క్రమబద్ధీకరణకు చేసుకున్న దరఖాస్తులు కార్యాలయానికి రాగానే విచారణ చేపడతామని అంబర్‌పేట ఎంఆర్‌ఓ లలిత తెలిపారు. మంగళవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ, ప్రభుత్వ నుంచి మార్గదర్శకాలను అనుసరించి ఇళ్లను క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు మీ సేవా కేంద్రాల నుంచి ఎంఆర్‌ఓ కార్యాలయానికి దరఖాస్తులు రాలేదన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలోని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో ప్రేమలతా కాలనీ, అజంపురా డివిజన్‌లోని అజంపురా, చాదర్‌ఘాట్ కాలనీలు జీఓ 58, 59 కింద ఉన్నాయని తెలిపారు. ఆ జీఓల కిందకు రాని దరఖాస్తులను తిరస్కరిస్తామని తెలిపారు.

తెగని పంచాయితీ!

- ఆక్రమణదారులు, లబ్ధిదారుల మధ్య గొడవ
- ఎమ్మెల్యే హామీ ఇచ్చినా మళ్లీ లబ్ధిదారుల ఆందోళన

నందనవనం ఇళ్ల కోసం ఇరువర్గాల మధ్య రగడ



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న బాధితులు (ఫైల్)

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో పేదల కోసం నిర్మించిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల మంజూరు వ్యవహారం జటిలంగా మారింది. ప్రభుత్వం 512 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయగా.. రెండేళ్ల క్రితం స్థానికంగా ఉండే కొందరు పేదలు తాళాలు పగులగొట్టి వాటిలో నివాసం ఉంటున్నారు. అయితే, ప్రభుత్వం నిజమైన లబ్ధిదారులను గుర్తించి, ఒక్కొక్కరి దగ్గర రూ.86 వేలు తీసుకొని వారికి గతంలోనే ఇళ్లు కేటాయించింది. వారు ఆ ఇళ్లలోకి వెళ్లేందుకు నందనవనం కాలనీకి రాగా.. ఆక్రమణదారులు వారిని రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో ఆక్రమణదారులు, ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల మధ్య ఘర్షణలు, ధర్నాలతో ఇళ్ల సమస్య తెగని పంచాయితీగా మారింది. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకుని ఇరువర్గాలను పిలిపించి న్యాయం చేస్తానని సర్దిచెప్పినా కూడా ఎవరూ వినిపించుకోవడం లేదు. అసలైన లబ్ధిదారులు పోలీస్‌స్టేషన్, మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతుండటం అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది.

పదేళ్ల క్రితం నిర్మాణం..

- పదేళ్ల క్రితం 512 గృహాలు నిర్మించిన ప్రభుత్వం అందులో 87 ఇళ్లను కొందరు లబ్ధిదారులకు అప్పట్లోనే కేటాయించింది. మిగిలిన 315 ఇళ్లలో నిరుపేదలు అక్రమంగా నివాసం ఉంటుండగా, 110 ఇళ్లలో స్థానికంగా ఉంటున్న ఓ వర్గం వారు అక్రమంగా ఉంటున్నారు.
- ఇదే ఇళ్లను నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన పేదలకు కేటాయిస్తూ ప్రభుత్వం ధ్రువ పత్రాలు అందజేసింది. అప్పటికే ఈ 425 ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఖాళీ చేసేది లేదని స్పష్టం చేయడంతో ఇళ్ల కేటాయింపు పత్రాలు అందుకున్న అసలైన లబ్ధిదారులు ఆ ఇళ్లను స్వాధీనం చేసుకోలేక పోయారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే (ఫైల్)

- ఆ ఇళ్లలో అక్రమంగా ఉంటున్న వారికి నగరంలోని ఇతర ప్రాంతాల్లో గృహాలు ఇవ్వాలని నిర్ణయించిన అధికారులు.. 2022 అక్టోబర్ 12న 285 కుటుంబాలకు డ్రా పద్ధతిలో ఇళ్లను కేటాయించారు. వారికి కేటాయించిన ఇళ్లన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయని, తాము అక్కడకు వెళ్లలేమని వారు నిరాకరించారు.
- ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఆక్రమణదారులు, లబ్ధిదారులకు మధ్య ఘర్షణ జరుగుతోంది. ఇరువర్గాల వారు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో మధ్యేయ మార్గంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆక్రమణదారులను అక్కడే ఉంచి.. అసలైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. ఈ ప్రతిపాదనకు అప్పట్లో ఒప్పుకున్న లబ్ధిదారులు.. తమకు ఇళ్లు కేటాయించాలంటూ ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.

ఇరు వర్గాలకు న్యాయం చేస్తాం



నందనవనం కాలనీలో నివాసం ఉంటున్న ఆక్రమణదారులకు, ప్రభుత్వం కేటాయించిన అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఇక్కడ గుడిసెలు వేసుకుని జీవించిన వారికి అన్యాయం జరిగింది. ఇరువర్గాల వారి సమస్యను ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లా. ఇరువర్గాల వారు నిరుపేదలే కావడంతో వారికి న్యాయం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నాం. ఎవరికీ అన్యాయం జరగకుండా ఇరువర్గాల వారికి న్యాయం చేస్తాం. దళారుల మాటలు నమ్మి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు.

– దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే

సరూర్‌నగర్ కట్టను సుందరీకరిస్తాం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ చెరువు కట్ట ఇరువైపులా సుందరీకరణ చేపడుతున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే మినీ ట్యాంక్‌బండను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెట్లను అందంగా ట్రిమ్మింగ్ చేయడం, ఆకర్షణీయమైన రూపాలు ఏర్పాటు చేసి రోడ్డుపై ప్రయాణించే వారికి కనువిందు చేసే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే చింతల్‌కుంట అండర్‌పాసు పక్కన, నాగోలు బ్రిడ్జి వద్ద సుందరీకరణ పనులు ప్రారంభించామన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఇంటెన్సివ్ శానిటేషన్, కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనంతుల సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో పాత డ్రైనేజీ పైప్‌లైన్ ఉండటంతో తరుచుగా డ్రైనేజీ పొంగుతోందని తెలిపారు. డ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం పెంచి డ్రైనేజీ సమస్యను పర్కిరించాలని సూచించారు. కాలనీ సంక్షేమ భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని కోరారు. కాలనీలో పాడైపోయిన రోడ్ల స్థానంలో కొత్త రోడ్ల వేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ, స్నేహపురి కాలనీలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కాలనీలోని ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ మాత్యనాయక్, జలమండలి అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మూర్తి, రామకృష్ణారావు, కోశాధికారి రామారావు, సహాయ కార్యదర్శి కళ్యాణి, శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్..

డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో మంగళవారం కార్పొరేటర్ పవన్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ లైన్ పగిలిపోవడంతో డ్రైనేజీ నీళ్లు నిరంతరం పొంగి ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు తెలిపారు. వెంటనే కార్పొరేటర్ పవన్‌కుమార్ సంబంధిత అధికారులను సంప్రదించి వీలైనంత తొందరగా డ్రైనేజీ నీళ్లు క్లీయర్ చేయాలని సూచించారు. పగిలిన పాత డ్రైనేజీ లైన్‌కు వెంటనే మరమ్మతు చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు జగదీశ్వర్‌రెడ్డి, వెంకటేష్, జగన్, మైకేల్‌రెడ్డి, శంకర్‌బాబు, ఉమకాంత్, నాయకులు రమేష్ చారి, శివచారి, కొత్త తిరుమల్, గట్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మంగళవారం పంజేషాహలోని కార్యాలయంలో నియోజవర్గ పరిధిలోని ఫర్హత్‌నగర్, ఉస్మాన్‌పుర, కాలాడేరా, చంచల్‌గూడ, ఆజంపుర ప్రాంతాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రూ.50,05,800 విలువైన చెక్కులు అందజేసినట్లు తెలిపారు. పేదింటి ఆడబిడ్డలకు ఈ పథకం ఓ వరం లాంటిదని, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో చార్మినార్ మండల రెవెన్యూ అధికారులు సాయికిరణ్, మహ్మద్ యూనస్, మహ్మద్ రిజ్వాన్, మజ్లిస్ నాయకులు ఉన్నారు.

యూసీడీ సభ్యులకు సత్కారం

మలక్‌పేట: అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) సభ్యులు అందిస్తున్న సేవలు ఎనలేనివని కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణ అన్నారు. మేడే సందర్భంగా టీబీసీసీఐ ఆధ్వర్యంలో కోర్ మెంబర్ ఏపూరి కృష్ణమూర్తి అధ్యక్షతన బీకే ఫంక్షన్‌హాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్‌లో పని చేస్తున్న యూసీడీ సభ్యులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో యూసీడీ విభాగం అత్యుత్తమ సేవలు అందించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, హుస్సేన్ ఖాన్, సంఘ సేవకురాలు, సినీనటి రూపాదేవి, టీబీసీసీఐ అధ్యక్షుడు చేరాల నారాయణ, సమన్వయకర్త వినయ్, ప్రధానకార్యదర్శి దాసరి కిరణ్, జనాధికార సమితి ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, సంఘ సేవకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానగ్రహీతలతో కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, అరుణ తదితరులు

ప్రియాంక గాంధీ సభకు భారీగా తరలిరావాలి: మల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ మైదానంలో ఈనెల 8న నిర్వహించ తలపెట్టిన నిరుద్యోగ నిరసన సభకు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరు కానున్నారని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి భారీగా జనం హాజరయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చైతన్యపురిలోని నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ డివిజన్ల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సన్నాహాక సమావేశంలో మల్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రియాంక గాంధీ మొదటి సారి తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నందున ఘనంగా స్వాగతం పలకాలని, రాష్ట్రంలోని నిరుద్యోగులు భాగస్వాములై నిరసన సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమావేశంలో అధికార ప్రతినిధి సంకెపల్లి సుధీర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, సదాశివుడు, లింగాల కిషోర్, నర్సింహ యాదవ్, వేణుయాదవ్, శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, మంజులా రెడ్డి, సత్యనారాయణ నాయకులు రమేష్‌నాయక్, రాజశేఖర్, సురేందర్‌రెడ్డి, పన్యాల జైపాల్‌రెడ్డి, మతిన్, షరీఫ్, మక్బూద్, షరీఫ్, జానీబాబా, అరుణ్ పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి పెళ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత



యువతి కుటుంబ సభ్యులకు పుస్తె, మెట్టెలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: నిరుపేదలకు ఉప్పల ఫౌండేషన్ ఎల్లప్పుడూ చేయూతనందిస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తట్టి అన్నారం గ్రామానికి చెందిన నిరుపేదలు జింకల సంధ్య, శంకర్‌ల కుమార్తె నందిని వివాహం త్వరలో జరగనుంది. దీంతో వారు మంగళవారం నాగోల్‌లోని శ్రీనివాస్ గుప్తా ఇంటికి వచ్చి కలవగా, మంగళసూత్రం, మెట్టెలు, చీర గాజులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా చేయూత అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్‌కు చెందిన ఆర్యవైశ్య నాయకులు రాజయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వీరోచిత పోరాటం వల్లే హక్కులు దక్కాయి



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

హస్తినాపురం: తమ హక్కుల సాధన కోసం కార్మికులు వీరోచిత పోరాటం చేశారని, ఆ పోరాటాల ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గానికి కొన్ని హక్కులు దక్కాయని జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య అన్నారు. మంగళవారం సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా హస్తినాపురంలోని అనుపమా నగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ కార్మికులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ, మే ఒకటవ తేదీ నుండి 6వ తేదీ వరకు మేడే వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ ఆటపాట కార్యక్రమాలు నిర్వహిస్తూ 6వ తేదీన ఆటోనగర్‌లో ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. భవన నిర్మాణ కార్మికులు, జీహెచ్‌ఎంసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు లత, జి.పున్నమ్మ, ఎం.భాగ్యమ్మ, దండు అంజమ్మ, శంకరమ్మ, అరవిందు, శ్రీనివాస్, ధనుంజయ, చంద్రమ్మ, అంజమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



కార్పొరేటర్ పవన్‌కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాగోలు: డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్‌తో పాటు ఇతర బీజేపీ కార్పొరేటర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ, డివిజన్లలో డ్రైనేజీ పనులు చేయడం లేదని, కనీసం 50 మీటర్లు 100 మీటర్ల డ్రైనేజీ పైప్‌లైన్‌ను కూడా మార్చకపోవడంతో ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వివిధ కాలనీల్లో డ్రైనేజీ నీళ్లు తాగునీటిలో కలిసి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నోసార్లు జలమండలి అధికారులను వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదు అన్నారు. తక్షణమే జలమండలి ఎండీ దాన కిషోర్, మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ధర్నా చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో ప్రారంభించిన పార్కు ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్కిల్ డీఈ దామోదర్‌రావు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు బాలనరసింహ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కేసీఆర్ కృషి



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి

సైదాబాద్: తెలంగాణలోని అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నా సుందర్‌రెడ్డి అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు నెలసరి వేతనం వెయ్యి రూపాయలు పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సింగరేణి కాలనీ చౌరస్తాలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆమె సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: కాటమయ్య స్వామి, సురమాంభ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు జల్‌పల్లిలో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం విగ్రహాలను ఊరేగించారు. మంగళవారం హోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. బుధవారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠాపన జరగనుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ గౌడ్, రాజేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ చింతల అరుణ

నాగోలు: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, దోమల బెడద తదితర సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ అన్నారు. మంగళవారం నాగోలు డివిజన్ పరిధిలోని అయ్యప్ప కాలనీ, హనుమాన్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో మల్లికార్జున నగర్ కమ్యూనిటీహాల్‌లో పారిశుద్ధ్యం, ఇతర సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని అన్ని పనులను తొందరగా పూర్తి చేస్తానని కాలనీ వాసులకీ హామీ ఇచ్చారు. వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అయ్యప్ప కాలనీలో డ్రైనేజీ పనులు తొందరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి అధికారి సత్యనారాయణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోండి

మీర్‌పేట: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం జనప్రియ మహానగర్‌లో ఏర్పాటు చేసిన కంటి శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 8 వరకు శిబిరం కొనసాగుతుందని, కంటికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే.. పరీక్ష చేసి, అవసరమైన వారికి వైద్యులు కళ్లద్దాలు, మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి, బాలాపూర్ యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్ కమలకుమారి, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గ్రాఫిక్ డిజైన్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- శివం ప్రాంగణంలో ఈ నెల 7న ప్రవేశ పరీక్ష
- 8 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం

నల్లకుంట: శ్రీ సత్య సాయి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిరుద్యోగ యువకులకు అడ్వాన్స్‌డ్ కాన్సెప్ట్, గ్రాఫిక్ డిజైన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బ్రాండ్ ఐడెంటిటీ డిజైన్, యూజర్ ఇంటర్ ఫేస్ డిజైన్, ఇన్ఫో గ్రాఫిక్ డిజైన్, ప్యాకేజింగ్ డిజైన్, ఎడిటోరియల్ డిజైన్, లైఫ్ స్కిల్స్ తదితర విభాగాల్లో శిక్షణ ఉంటుందని ఆర్గనైజేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

- నల్లకుంట శివం ప్రాంగణంలో ఈ నెల 7న ఉదయం 9 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. డిగ్రీ ఉత్తీర్ణులై కంప్యూటర్‌లో ప్రవేశం, ఫోటోషాప్, కోరల్ డ్రా పరిజ్ఞానం ఉండి 28 ఏళ్ల లోపు ఉన్న యువకులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు.
- ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 45 రోజుల పాటు శివం ప్రాంగణంలో ఆయా కోర్సుల్లో శిక్షణ ఉంటుందని ఈ నెల 8 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.